

అటకెక్కిన 'చెత్త'శుద్ధి

ఉమ్మడి జిల్లాలో కంపోస్టు షెడ్లు క్రమంగా నిరుపయోగంగా మారుతున్నాయి. గ్రామాలకు దూరంగా నిర్మించడంతో వినియోగించడం లేదు. 8లో▸



వన్యప్రాణుల దాహం తీరేదెలా?

కెరమెరి అటవీ ప్రాంతంలోని క్వారీ గుంతలో పుష్కలంగా నీరుంది. గుంతలోకి దిగే అవకాశం లేక వన్యప్రాణులు నీటిని వినియోగించుకోలేని పరిస్థితి. 9లో▸

గరిష్టం/కనిష్టం

34.0 /22.8

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. తెల్లవారుజామున చలి తీవ్రత కొనసాగుతుంది. పగలు ఎండ వేడి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా సీవోఈ ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఆదివారం నిర్వహించిన సీవోఈ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గిరిజన సీవోఈ విద్యాలయాల్లో ఇంటర్మీడియెట్ ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షకు జిల్లాలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. మొత్తం 851 మంది విద్యార్థులకు 828 మంది హాజరు కాగా.. 23 మంది గైర్హాజరయ్యారని గిరిజన బాలుర, బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్ తెలిపారు.

జాతీయస్థాయి పోటీల్లో సాక్షి సత్తా



కాంస్య పతకంతో సాక్షి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాక్షి జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా చాటింది. ఈ నెల 16 నుంచి గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో నిర్వహిస్తున్న అండర్ 14 జావెలిన్‌త్రోలో సాక్షి కాంస్య పతకం సాధించినట్లు డీఎస్‌వో మీనారెడ్డి, హెచ్‌ఎం కృష్ణారావు ఆదివారం తెలిపారు. ఈటెను 29.97 మీటర్ల దూరం విసిరినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థిని అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్, డీటీడీవో రమాదేవి, ఏసీఎంవో ఉద్దవ్ ప్రత్యేకంగా అభినందించారు.

26న మెగా జాబ్‌మేళా

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం ఈ నెల 26న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగులు తమ మండల పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ మెగా మేళాలో 50 మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ, బీటెక్ పూర్తి చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సిర్పూర్(టి): రాష్ట్రంలోని ధూపదీప నైవేద్య అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ నెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీడీఎన్ అర్చక సంఘం రాష్ట్ర ప్రతినిధి గంగు సత్యనారాయణశర్మ, జిల్లా అధ్యక్షుడు శిరీశ్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అర్చకుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అధిక సంఖ్యలో విజయవంతం చేయాలని కోరారు.

ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక



అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మంచిర్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.మల్లారెడ్డి ఎన్నికల పరిశీలకునిగా, అడ్వకేట్ శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. చీఫ్ ప్యాట్రన్‌గా వేణుగోపాలాచారి, చైర్మన్‌గా కె.పార్థసారథి, అధ్యక్షుడిగా బి.గోవర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణరెడ్డి, ప్రధానకార్యదర్శిగా రఘునాథరెడ్డి, ట్రెజరర్‌గా కనపర్తి రమేశ్, ఉపాధ్యక్షులుగా రాంచందర్, ఎస్. శ్రీధర్‌రెడ్డి, ఎం.సాంబమూర్తి, యు.చంద్రమోహన్ గౌడ్, ఎం.శ్రీనివాస్, చంద్రయ్య, జాయింట్ సెక్రటరీలుగా పుల్లూరి సుధాకర్, సుకుమార్ ఫ్రాన్సిస్, బి.రమేశ్, కే.శేఖర్, కే.పాండు నాయక్, కే.శ్రీనివాసరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, ఈ. మారయ్య, ఎల్. శరత్‌బాబు, బి.శ్రీనివాస్‌గౌడ్, డి.దేవేందర్, ఎస్. హరిచరణ్, భూమన్న, ఈశ్వరాచారి, మహేందర్‌సింగ్, చీఫ్ అడ్వైజర్‌గా కే. సుదర్శన్‌గౌడ్, అడ్వైజర్లుగా బి.బాబురావు, పరిమళ, లీగల్ అడ్వైజర్లుగా చిట్ల రమేశ్, నిమ్మతి శ్రీనివాస్, టెక్నికల్ అడ్వైజర్‌గా ఎండీ నజీర్ ఎన్నికయ్యారు.

దారుణం..!



- ఆసిఫాబాద్ నడిబొడ్డున రక్షణ కరువు
- ఒంటరి మహిళపై అత్యాచార యత్నం!
- బ్లూ కోల్ట్స్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- ఫిర్యాదు చేసేందుకు ధైర్యం చేయని బాధితురాలు
- పట్టణంలో గాలిలో దీపంలా పోలీసుల రాత్రిపూట గస్తీ

సాక్షి, ఆసిఫాబాద్: మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు తెచ్చినా దుండగుల ముందు అవన్నీ దిగదుడుపే అవుతున్నాయి. 24 గంటలు మహిళల భద్రత కోసం పాటుపడుతున్నామని ఓ వైపు పోలీసుశాఖ చెబుతుండగా.. పట్టణ నడిబొడ్డున దారుణాలు జరుగుతున్నాయి. ఆసిఫాబాద్ పట్టణంలోని కంచుకోట ప్రాంతంలో శనివారం రాత్రి ఓ మహిళ ఇంటికెళ్తుండగా పూటుగా మద్యం తాగి ఉన్న నలుగురు వ్యక్తులు ఆమెపై లైంగిక దాడికి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలో ఈ ఘటన కలకలం రేపింది. ఆసిఫాబాద్ పట్టణంలోని కంచుకోట ప్రాంతానికి చెందిన ఓ ఒంటరి మహిళ (25) జీవనోపాధి కోసం పట్టణంలోని ఓ ఫ్యాన్సీ స్టోర్‌లో సేల్స్ ఉమెన్‌గా పనిచేస్తోంది. శనివారం రాత్రి 8.35 గంటలకు ఆమె ఫ్యాన్సీ స్టోర్‌లో పని ముగించుకుని ఇంటికి బయలుదేరింది. కంచుకోట పిండిగిర్నీ సమీపంలో నలుగురు వ్యక్తులు బీరు బాటిళ్లు పెట్టుకొని తాగుతూ కనిపించారు. సదరు మహిళ వెనుకే మరో యువతి కూడా అటుగా వస్తోంది. బాధిత మహిళ పిండిగిర్నీ సమీపంలోకి రాగానే బీరు బాటిల్‌తో ఓ వ్యక్తి ఆమెను అడ్డగించే యత్నం చేశాడు. ఇంతలో వెనుకే వస్తున్న యువతి బంధువులు వచ్చి ఆ యువతిని బైక్‌పై తీసుకెళ్లారు. వారు వెళ్లిన వెంటనే నలుగురు తాగుబోతులు కలిసి మహిళను పక్కకు లాగే ప్రయత్నం చేశారు. అయితే వెంటనే తేరుకున్న బాధితురాలు కేకలు వేయడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. కాగా ఈ పెనుగులాటలో దుండగులు ఆ మహిళపై భౌతిక దాడికి దిగడంతో తలకు గాయాలయ్యాయి. కొంతకాలంగా సదరు బాధితురాలు కదలికలను గమనిస్తున్న నలుగురు దుండగులు శనివారం రాత్రి పథకం ప్రకారం కాపు కాసి లైంగిక దాడికి యత్నించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై బాధితురాలు తన తల్లికి వివరించింది. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సాహసించలేదు. ఫిర్యాదు చేస్తే లేనిపోని సమస్యలు తలెత్తుతాయనే భయంతో మిన్నకుండి పోయినట్లు సమాచారం.

ఫోన్ చేస్తే ఉచిత సలహా..

శనివారం రాత్రి జరిగిన ఘటన గురించి బాధితురాలు ఫ్యాన్సీ స్టోర్ యజమానికి ఆదివారం మధ్యాహ్నం తెలిపింది. ఆయన వెంటనే బ్లూ కోల్ట్స్ సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించగా.. 'పోలీసు స్టేషన్‌కు వెళ్లి బాధితురాలిని ఫిర్యాదు చేయమనండి.. ఆమెకు మా నంబరు ఇవ్వండి.. మరోసారి అలా జరిగితే మా నంబరుకు ఫోన్ చేసి చెప్పమనండి.. చర్యలు తీసుకుంటాం' అని ఫ్యాన్సీ స్టోర్ యజమానికి బ్లూ కోల్ట్స్ సిబ్బంది ఉచిత సలహా ఇచ్చినట్లు ఆయన మీడియా వద్ద వాపోయారు. 'భయాందోళనలో ఉన్న బాధితురాలు ఫిర్యాదు ఎలా చేయగలదు? కాబట్టే పోలీసులను తమ షాప్ వద్దకు వచ్చి బాధితురాల నుంచి వివరాలు సేకరించాలని కోరాను. వారి నుంచి ఇలాంటి సమాధానం వస్తుందని తాను ఊహించలేదు' అని ఫ్యాన్సీ స్టోర్ యజమాని పేర్కొంటున్నారు. పోలీసులకు సమాచారం అందించినా.. ఆదివారం సాయంత్రం వరకు కూడా ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవడంతో పోలీసుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గస్తీ జాడేది?

జిల్లా కేంద్రంలో ఆరు నెలల్లో దొంగలు హల్‌చల్ చేసి పలు ఇళ్లలో చోరీలు చేసి పరారైనా.. పోలీసు శాఖలో మార్పు కనిపించకపోవడం శోచనీయం. బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ సిబ్బందితో ప్రతిరోజూ రాత్రిపూట జిల్లా కేంద్రంలో గస్తీ నిర్వహించాల్సి ఉంది. కానీ, అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు జరగకుండా గస్తీ ముమ్మరం చేయాల్సిన పోలీసు అధికారులు సిబ్బంది లేమిని కారణంగా చూపి కేవలం బ్లూకోల్ట్స్ సిబ్బందితో మాత్రమే గస్తీ నిర్వహిస్తుండటం గమనార్హం.

గల్లీకొక బెల్ట్ షాపు..

జిల్లా వ్యాప్తంగా 1000కి పైగా మద్యం బెల్టు షాపులు ఉండగా.. ఒక్క ఆసిఫాబాద్ పట్టణ కేంద్రంలోనే వాటి సంఖ్య వంద వరకు ఉండటం గమనార్హం. కూర్చున్న చోటే మద్యం లభిస్తుండటంతో మందుబాబుల ఆగడాలకు అడ్డు లేకుండా పోతోంది. అర్ధరాత్రి.. అపరాత్రి అని తేడాలేకుండా మద్యం గల్లీగల్లీలో అందుబాటులో ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్సైజ్, పోలీసులు మామూళ్ల మత్తులో జోగుతుండటంతోనే ఇలాంటి అఘాయిత్యాలకు దుండగులు ఒడిగడుతున్నారని, తద్వారా అభాగ్యుల జీవితాలు బుగ్గిపాలవుతాయని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఇంకా అందని 'గుర్తింపు'

- ఎన్నికలు పూర్తయి రెండు నెలలు
- ఏఐటీయూసీకి అధికారికంగా దక్కని గుర్తింపు హోదా
- జాప్యంతో మొదలు కాని స్ట్రక్చరల్ సమావేశాలు
- గుర్తింపు కాలపరిమితిపై సస్పెన్స్



శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి రెండు నెలలవుతున్నా ఇప్పటికీ గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీకి అధికారిక పత్రం అందలేదు. డిసెంబర్ 27, 2023న 7వ దఫా గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. ఇందులో ఏఐటీయూసీ ఘన విజయం సాధించి కంపెనీలో గుర్తింపు సంఘంగా నిలిచింది. మొత్తం 11 డివిజన్లలో అత్యధికంగా ఓట్లు సాధించి గుర్తింపు హోదా కైవసం చేసుకుంది. వీటిలో ఐదు డివిజన్లు ఏఐటీయూసీ గెలువగా మిగతా ఆరు ఏరియాలో ఐఎన్టీయూసీ గెలిచి ప్రాతినిధ్య సంఘంగా నిలిచింది. రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఏఐటీయూసీకి అధికారిక పత్రం అందకపోవడంతో ఆ యూనియన్ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో యూనియన్ల వారీగా వచ్చిన ఓట్లు, గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘాలను ప్రకటిస్తూ ఆర్‌ఎల్సీ ఇది వరకే కంపెనీకి లేఖ అందించింది. దీని ఆధారంగా కంపెనీ చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం డైరెక్టర్ పా ఆధ్వర్యంలో నోట్ ఫైల్ తయారు చేసి తరువాత గుర్తింపు సంఘంగా ఏటీయూసీని, ఆరు ఏరియాల్లో గెలిచిన ఐఎన్టీయూసీని ప్రాతినిధ్య సంఘంగా గుర్తిస్తూ అన్ని ఏరియాలకు ఆదేశాలివ్వాలి. అయితే ఈ ప్రక్రియలో తీవ్రజాప్యం అవుతోంది. దీంతో కంపెనీలో నిర్వహించాల్సిన స్ట్రక్చరల్, సేఫ్టీ, జేసీసీ సమావేశాలకు బ్రేక్ పడింది. గత గుర్తింపు సంఘం కాలంలోనూ ఇవి సక్రమంగా కొనసాగలేదు. మూడేళ్లుగా ఈ సమావేశాలన్నీ బంద్ అయ్యాయి. కొత్తగా గెలిచిన ఏఐటీయూసీతోనైనా మళ్లీ మొదలవుతాయనుకుంటే ఇప్పటికీ కంపెనీ అధికారికంగా గుర్తింపు పత్రం ఇవ్వకపోవడంతో గందరగోళం నెలకొంది. ఆయా కార్యక్రమాల్లో పాల్గొనే క్రమంలో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నాయకుల మధ్య ప్రొటోకాల్ సమస్య కూడా ఉత్పన్నం అవుతుంది.

కాలపరిమితి ఎంతా..?

ఎన్నికల ముందు వరకు గుర్తింపు సంఘం కాలపరిమితి నాలుగేళ్లుగా ఉంది. కంపెనీ ప్రస్తుతం రెండేళ్లకు మొగ్గు చూపుతున్నట్లు చర్చ సాగుతోంది. అయితే సంస్థ దీనిపై అధికారికంగా ప్రకటన చేయలేదు. అంతర్గతంగా మాత్రం నాలుగేళ్లు కొనసాగించాలా.. రెండేళ్లకు కుదించాలా అన్న చర్చ ఉన్నతస్థాయి వర్గాల్లో జరుగుతున్నట్లు ప్రచారం ఉంది. ఇదే జరిగితే తాము న్యాయం పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఏఐటీయూసీ నేతలు పేర్కొంటున్నారు.

2003 నుంచి 'నాలుగేళ్లు' కొనసాగింపు..

ఇదిలా ఉంటే సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు 1998 నుంచి మొదలయ్యాయి. మొదటి రెండు దఫాలు రెండేళ్ల కాలపరిమితితో కొనసాగగా.. తరువాత 2003 నుంచి నాలుగేళ్ల కాలపరిమితితో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 2017 ఎన్నికల్లో కూడా నాలుగేళ్ల పరిమితి అమలు చేశారు. ఇటీవల జరిగిన ఏడో దఫా ఎన్నికల ముందు ఆర్‌ఎల్సీ సమక్షంలో కూడా అన్ని సంఘాలు నాలుగేళ్లే ఉండాలని సీఎల్సీని కోరుతూ లేఖ రాసిచ్చాయి. ఈ క్రమంలో కంపెనీ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

'అవిశ్వాసంపై హైకోర్టు స్టే'

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండల ఎంపీపీ చునార్కర్ సువర్ణపై వైస్ ఎంపీపీ ఈర్ల సత్యనారాయణతోపాటు మరో ఐదుగురు ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాస నోటీసుపై హైకోర్టు స్టే విధించింది. ఈ మేరకు మండల కేంద్రంలో ఎంపీపీ సువర్ణ ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 5న కాగజ్‌నగర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సురేశ్‌బాబుకు అవిశ్వాస నోటీసు అందజేయగా.. ఈ నెల 27న అవిశ్వాస పరీక్ష నిర్వహించేందుకు తేదీ ఖరారు చేశారు. దీనిపై ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు నోటీసులు సైతం జారీ చేశారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సువర్ణ

హైకోర్టును ఆశ్రయించడంతో అవిశ్వాస పరీక్ష జరగకుండా స్టే విధించినట్లు ఎంపీపీ తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు దుర్గం విక్రం, తుకారాం, ఇఫాత్ హుస్సేన్, చునార్కర్ ఉమాజీ తదితరులు పాల్గొన్నారు.

'నాగోబా' ఆదాయం రూ.17.71 లక్షలు



హుండీ లెక్కిస్తున్న మెస్రం వంశీయులు, అధికారులు

- హుండీ ద్వారా రూ.8.62 లక్షలు..
- తైబజార్ ద్వారా రూ.9.09 లక్షలు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఈ ఏడాది నాగోబా జాతర ఆదాయం రూ.17.71 లక్షలు సమకూరింది. ఈ నెల 9 నుంచి 17వరకు జాతర కొనసాగింది. ఇందులో భాగంగా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని మెస్రం వంశీయులు, దేవాదాయ, రెవెన్యూ అధికారుల సమక్షంలో ఆదివారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.8లక్షల 62 వేల 15 రాగా.. తైబజార్ ద్వారా రూ.9 లక్షల 9 వేలు, కానుకల రూపంలో 425 గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో రాజమౌళి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం వంశ పెద్దలు కోసు, కోసేరావ్, బాదిరావ్‌పటేల్, వంశ ఉద్యోగులు శేఖర్‌బాబు, సోనేరావ్, కోసేరావ్ తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్ర జయప్రదం చేయాలి



జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్: విజయ సంకల్ప యాత్ర విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 20న బాసర నుంచి ప్రారంభం కానున్న విజయ సంకల్ప యాత్ర కుమురం భీం జిల్లాకు 22న చేరుకుంటుందని తెలిపారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ ద్వారా జైనూర్‌కు వచ్చి యాత్రకు స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని, లోక్‌సభ ఎన్నికల్లో విజయం కోసం సైనికుల్లా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో సంకల్ప యాత్ర సలహాదారుడు రామనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, రాథోడ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో ఈ నెల 22 నుంచి విజయ సంకల్ప యాత్ర ప్రారంభమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న వాల్ రైటింగ్స్‌ను శుక్రవారం పరిశీలించారు. హస్నాపూర్ ఎక్స్‌రోడ్ నుంచి బైక్‌ర్యాలీ ద్వారా జైనూర్ మీదుగా ఆసిఫాబాద్‌కు యాత్ర చేరుకుంటుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 23న కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, పార్లమెంట్ కోకన్వీనర్ కిరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి కుందారపు బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'తునికాకు'కు పర్మిషన్

- పులుల సంచారం నేపథ్యంలో నిలిపి వేయాలని అటవీశాఖ ప్రతిపాదన
- ఆందోళనల నేపథ్యంలో ఆకు సేకరణకు ప్రభుత్వం అనుమతి
- జిల్లాలో 15 యూనిట్ల పరిధిలో 179 కల్లాల ఏర్పాటు
- ఆన్‌లైన్ ద్వారా టెండర్ల స్వీకరణ
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు



తునికాకు సేకరణ చేపట్టాలని ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాలు(ఫైల్)

కౌటాల(సిర్పూర్): ఆదివాసీ సంఘాల ఆందోళనకు ఫలితం లభించింది. ప్రభుత్వం తునికాకు సేకరణకు అనుమతినిచ్చింది. ఆందోళనల నేపథ్యంలో ప్రజలకు ఉపాధినిచ్చే బీడీ ఆకు సేకరణ ఈ ఏడాది యథాతథంగా కొనసాగనుంది. సాధారణంగా ఏటా వేసవి ప్రారంభానికి ముందే అటవీశాఖ టెండర్లు పిలుస్తోంది. కాంట్రాక్టర్లు కొమ్మ కొట్టడం పూర్తి చేసి తునికాకు సేకరణను మొదలుపెడతారు. అయితే పులుల సంచారం నేపథ్యంలో జిల్లాలో తునికాకు సేకరణను నిలిపివేయాల్సిందిగా అటవీశాఖ ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే.

ఆదివాసీ సంఘాల ఆందోళన

వేసవి పంటగా భావించే తునికాకు సేకరణలో జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున పాలుపంచుకుంటారు. ఈ ఏడాది తునికాకు సేకరణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆదివాసీ సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. ముఖ్యంగా కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని అడవుల్లో పెద్దపులుల సంచారం పెరిగిన నేపథ్యంలో మనుషుల అలికిడిని తగ్గించేందుకు తునికాకు సేకరణను నిలిపివేసేందుకు అటవీశాఖ యత్నిస్తోంది. ఈ మేరకు నాలుగేళ్లుగా జిల్లా అటవీశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నారు. ఈ ఏడాది కూడా తునికాకు సేకరణ వద్దంటూ ప్రతిపాదనలు పంపించడంతో ప్రజాసంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఆందోళనలు చేపట్టడంతోపాటు అధికారులకు వినతిపత్రాలు అందించారు. అలాగే సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు తునికాకు సేకరణ ప్రక్రియను కొనసాగించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రితోపాటు పలువురికి విన్నవించారు. స్పందించిన ప్రభుత్వం ఈ ఏడాది తునికాకు సేకరణకు అనుమతి ఇచ్చింది. మార్చి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో టెండర్ల ప్రక్రియను నిర్వహించనుంది. ఈ ప్రక్రియ పూర్తికాగానే కొమ్మ కొట్టడం పూర్తి చేసి, మే మొదటి వారంలో తునికాకు సేకరణ ప్రారంభించనున్నారు.

కాగజ్‌నగర్ డివిజన్‌లో ఎక్కువ..

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని కాగజ్‌నగర్, కౌటా ల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్ మండలాల్లో తునికాకు సేకరణ ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది జిల్లాలో 15 యూనిట్ల, 179 కల్లాల్లో 26,300 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరణ లక్ష్యంగా నిర్ణయించారు. గతేడాది 13 యూనిట్లకు మాత్రమే అనుమతినిచ్చారు. ఈసారి కొత్తపేట, బొంబాయిగూడ యూనిట్లను పునరుద్ధరించారు. కాగజ్‌నగర్ డివిజన్‌లోని బెజ్జూర్, సలుగుపల్లి, గూడెం, ఖర్జెల్లి, చీలపెల్లి, ముత్తంపేట్, కొత్తపేట, అనుకోడ, పెంచికల్‌పేట్, లోన్‌వెల్లి, కడంబా, డబ్బా, బొంబాయిగూడలోని మొత్తం 13 యూనిట్ల 157 కల్లాల్లో 20,600 స్టాండర్డ్ బ్యాగులు, ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని గిరివెల్లి, గిన్నెధరి రెండు యూనిట్లు 22 కల్లాల్లో 5,700 స్టాండర్డ్ బ్యాగులు లక్ష్యంగా నిర్దేశించారు. దాదాపు 35 వేల మంది తునికాకు సేకరణలో పాలుపంచుకునే అవకాశం ఉంది. తునికాకు సేకరణకు ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో జిల్లా వాసుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

పేదలకు వేసవి ఉపాధి



ఏటా వేసవిలో గ్రామీణ ప్రాంతాల వారికి తునికాకు జీవనోపాధి కల్పిస్తోంది. తునికాకు సేకరణకు ప్రభుత్వం ఈ ఏడాది సైతం అనుమతి ఇవ్వడం సంతోషకరం. ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని అడవుల్లోకి వేకువజామున్నే వెళ్లి ఆకు తీసుకువస్తుంటాం. కట్టకు రూ.8 చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కూలీలకు ప్రమాదం జరిగితే రూ.20 లక్షల పరిహారం చెల్లించాలి.

– రాజేశ్వరి, గంగాపూర్, చింతలమానెపల్లి

పోరాటాలతోనే..



జిల్లా అటవీశాఖ అధికారులు పులులు కారిడార్ పేరిట తునికాకు సేకరణ నిలిపివేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీంతో అన్ని సంఘాల ఆధర్యంలో ఆందోళన చేపట్టాం. స్పందించిన ప్రభుత్వం తునికాకు సేకరణకు అనుమతినిచ్చింది. ఆసిఫాబాద్ డివిజన్‌లో 12 యూనిట్లకు రెండే యూనిట్లలో ఆకు సేకరణ ఉంది. అక్కడ కూడా అన్ని యూనిట్లకు అనుమతివ్వాలి.

– కోట శ్రీనివాస్, టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా..



కాగజ్‌నగర్ డివిజన్‌లోని ఐదు యూనిట్లలో తునికాకు సేకరణ నిలిపి వేయాలని, అటవీశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. గిరిజనులు విన్నపం మేరకు తునికాకు సేకరణ చేపట్టాలని రాష్ట్ర మంత్రి సీతక్క, రాష్ట్ర అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లా. దీంతో ప్రభుత్వం ఆకు సేకరణకు అనుమతినిచ్చింది. జిల్లాలో 35 వేల మందికి నెల రోజుల పాటు ఆకు సేకరణతో ఉపాధి పొందనున్నారు. టైగర్ కారిడార్ పేరిట అటవీశాఖ తునికాకు సేకరణను నిలిపివేస్తే ఊరుకోం.

– పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే

క్లుప్తంగా

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



కవితాబాయి మృతదేహం

సారంగపూర్: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి వివరాల ప్రకారం... మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ కవితాబాయి (40), భర్త రమేష్‌లకు మధ్య కొద్దిరోజులుగా మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటి నుంచి బయటకు వచ్చిన కవితాబాయి గోపాల్‌పేట్ చెరువు వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కవితాబాయి మృతిపై ఆమె సోదరుడు జాదవ్ రవి అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు. మృతురాలికి ముగ్గురు సంతానం ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు..



విజయ్(ఫైల్)

కౌటాల: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన సూరం విజయ్ (24), పల్లవి భార్యభర్తలు. వీరికి కుమార్తె ఉంది. విజయ్..వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబ పోషణ భారంగా మారడంతో ఈనెల 14న రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. ఆగ్రహానికి లోనై విజయ్ భార్యపై చేయిచేసుకోవడంతో అదే రాత్రి పల్లవి తన పుట్టింటికి వెళ్లింది. మేడారం జాతర వెళ్లేందుకు భార్యను పంపించాలని విజయ్ శనివారం సాయంత్రం అత్తకు ఫోన్ చేశాడు. పంపించనని చెప్పడంతో మనస్తాపం చెంది రాత్రి తన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు ఆదివారం పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి అన్నయ్య బానేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో దూకి గర్భిణి ఆత్మహత్యాయత్నం

భైంసా: బాసర గోదావరి వద్ద గర్భిణి కుటుంబ కలహాల నేపథ్యంలో గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాసర ఎస్సై గణేశ్ వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం బెల్లాల్‌కు చెందిన మూడు నెలల గర్భిణి ఆదివారం బాసరకు చేరుకుంది. స్థానిక గోదావరి నదిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా సమీపంలో ఉన్న గంగపుత్రులు ఆమెను కాపాడారు. అనంతరం బాసర పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు ఎస్సై తెలిపారు.

అటకెక్కిన 'చెత్త'శుద్ధి



కోటపల్లి మండలం బబ్బరుచెల్కలో నిరుపయోగంగా కంపోస్టు షెడ్డు

- ఉమ్మడి జిల్లాలో నిరుపయోగంగా షెడ్లు
- కొన్ని గ్రామాలకు దూరంగా..
- నెరవేరని ప్రభుత్వ ఆశయం

కోటపల్లి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పంచాయతీలకు తగిన ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రతీ పంచాయతీలో కంపోస్టు షెడ్లు నిర్మించింది. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.12 లక్షలు వెచ్చించింది. గ్రామాల పరిశుభ్రతకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదే అయినా కిందిస్థాయి ఉద్యోగుల అలసత్వం కారణంగా నిర్మాణాలు నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని పంచాయతీల్లో షెడ్లు గ్రామానికి దూరంగా ఉండటంతో వినియోగించడం లేదు. ప్రతీ జీపీకి ఒక ట్రాక్టర్ సమకూర్చడంతో చెత్త సేకరణ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవు. కొన్ని చోట్ల నిత్యం జరగకపోవడంతో గ్రామీణ ప్రజలు ఖాళీ స్థలాల్లోనే పడేస్తున్నారు. వర్షాకాలంలో ఆ చెత్త తడిసి దుర్గంధం వెదజల్లుతోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

జిల్లా	పంచాయతీలు	ప్రత్యేకాధికారులు
మంచిర్యాల	311	138
కుమురంభీం	335	125
నిర్మల్	396	176
ఆదిలాబాద్	468	123

తయారుకాని ఎరువు!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1509 గ్రామ పంచాయతీలకు గత ప్రభుత్వం ఒక ట్రాక్టర్‌తోపాటు నీళ్ల ట్యాంకర్ కేటాయించింది. గ్రామాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించేందుకు గతంలో బుట్టలు పంపిణీ చేసింది. వీటిని కొంతవరకే పంపిణీ చేయగా..చాలామందికి చెత్త బుట్టలు రాకపోవడంతో వారు తడి,పొడి చెత్తను వేరు చేయకుండా ఇష్టానుసారంగా అందిస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది వాటిని వేరుచేసి షెడ్లలో వేసి ఎరువు తయారు చేయాలి. ఇలా తయారైన ఎరువును గ్రామ పంచాయతీలు విక్రయించి అదనపు ఆదాయాన్ని పెంచుకోవాలనేది వీటి ఉద్దేశం. చాలావరకు గ్రామాల్లో ఎరువు తయారు చేస్తున్న దాఖలాలే లేవు. కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా ఉంటుండటంతో ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు.

వృథాగా నిర్మాణాలు

సేంద్రియ ఎరువు తయారీ చేసేలా కంపోస్టు షెడ్లు నిర్మించారు.బ్లాకులవారీగా నిర్మాణాలు చేపట్టారు. వీటిలో చాలారోజుల వరకు చెత్తను నిల్వ చేసి ఎరువుగా మారుస్తారు. ఈ షెడ్లు గ్రామాలకు దూరంగా ఉండటంతో నిరుపయోగంగా మా రాయి. జాగా లేదని కొద్దిస్థలంలో నిర్మాణం చేపట్టి వదిలేశారు. ఒకేస్థలంలో శ్మశానవాటిక,పక్కనే కంపోస్టు షెడ్లు నిర్మించారు. అధికారులు వీటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకువస్తాం

గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లను వెంటనే వినియోగంలోకి తీసుకువస్తాం. గ్రామాల్లో నిత్యం చెత్త సేకరణ జరిగేలా పంచాయతీ కార్యదర్శులను ఆదేశిస్తాం. షెడ్లలో సేంద్రియ ఎరువు తయారీ చర్యలు తీసుకుంటాం. – అక్తర్, ఎంపీవో, కోటపల్లి



అ'పూర్వ' సమ్మేళనం

దండేపల్లి మండలం రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వారు చదువుకున్న పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. – దండేపల్లి

జీవాలతో వలసబాట...



జీవాలతో వస్తున్న కాపరులు

నిజామాబాద్ జిల్లా నుంచి గొర్రెల కాపర్లు నిర్మల్ జిల్లాకు వలసబాట పట్టారు.. మేకలు, గొర్రెలు తీసుకుని పక్షం రోజుల క్రితం జిల్లాకు చేరుకున్నారు. తానూరు, ముధోల్, కుభీర్ మండలాల్లోని ఆయా గ్రామాల శివారులోని పంట పొలాల్లో జీవాలను మేపుతున్నారు. రాత్రివేళ పొలాల్లో జీవాల మంద పెడుతున్నారు. ఇందుకు రైతులు ఒక రోజుకు రెండు అడ్డల బియ్యం, రూ.రెండు వందలు ఇస్తారని కాపరులు చెబుతున్నారు. ఈ నెలలో అక్కడ వరి పంట ఉండదంతో జీవాలకు మేత లేక పోవడంతో ఇక్కడికి వస్తున్నట్లు తెలిపారు. మందపెట్టడంతో ఇటు కాపరులు.. అటు భూయాజమానికి ప్రయోజనం చేకూరనుంది. – తానూరు

బర్త్ డే వేడుకల్లో అపశ్రుతి

- కేక్ తిని చిన్నారులకు అస్వస్థత
- చెన్నూర్‌లో ఘటన



స్వీట్ షాపు వద్ద పాడైన కేక్‌తో మహేందర్

చెన్నూర్: స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సవాల మధ్య జరుపుకునే పుట్టినరోజు వేడుకల్లో అపశ్రుతి జరిగింది. పలువురు చిన్నారులు అస్వస్థతకు గురైన ఘటన చెన్నూర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రజక కాలనీకి చెందిన నిమ్మల శ్రీకాంత్ కుమారుడు మహేందర్ బర్త్‌డే వేడుకల సందర్భంగా శనివారం రాత్రి స్నేహితులు, కుటుంబీకుల మధ్య కేక్‌కట్ చేశారు. మహేందర్‌తోపాటు పలువురు కేక్ తిని వాంతులు చేసుకున్నారు. కేక్ లోపలి, కింది భాగం బూజు పట్టి ఉండడాన్ని మహేందర్ తండ్రి శ్రీకాంత్ గుర్తించి మహదేశ్ స్వీట్ హౌజ్‌కు వెళ్లాడు. పాడైన కేక్‌ను వ్యాపారికి చూపిస్తే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడని తెలిపారు. వ్యాపారులు పాడైన కేక్‌లు విక్రయించి చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తానని శ్రీకాంత్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారులు నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయిస్తున్నా చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేకే ఓసీపీ సందర్శన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాస్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీపీని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్, పా) శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ఓసీపీ పరిసరాలను పరిశీలించారు. అనంతరం గనికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరో 40 రోజుల్లో ఆర్థిక సంవత్సరం పూర్తికానున్న సందర్భంగా ఏరియా ఉత్పత్తి లక్ష్యసాధనకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అంతకుముందు సిమ్ టర్స్ సెంటర్‌లో త్వరలో ఏర్పాటుచేసే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఏరియా జీఎం మనోహర్, ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు నాగరాజు, విజయ్‌కుమార్, కేకే ఓసీ పీవో రమేశ్ తదితరులు ఉన్నారు.

పొట్టకూటికి తిప్పలు



నెన్నెలలో తిరుగుతున్న పగటి వేషగాళ్లు

నెన్నెల: పొట్టకూటి కోసం పగటి వేషగాళ్లు గ్రామాల్లో సంచరిస్తూ వివిధ వేషాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. ప్రజల నుంచి సంభావనలు తీసుకుంటున్నారు. జానపద కళ అయిన పగటి వేషం బతుకుదెరువు కోసం యాచక వృత్తిగా మారిపోయిందని పగటి వేషగాళ్లు (బుడగజంగాల వారు) చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా తొర్రూరు మండలానికి చెందిన పగటివేషగాళ్లు మాయల ఫకీర్, ఆది భైరాగి, నవాబ్, జంగం దేవర, అర్ధనారీశ్వరులు లాంటి వేషం వేసి ప్రదర్శనలు ఇస్తూ ఇంటింటి నుంచి పాత దుస్తులు, డబ్బులు సేకరిస్తూ ఆదివారం సాక్షి కెమెరాకు చిక్కారు. తరతరాలుగా వస్తున్న పగటివేష కళను వృత్తిగా మలుచుకొని పొట్టకూటి కోసం పిల్లపాపలతో తిప్పలు పడుతున్నామని వారు సాక్షికి వివరించారు.

బీఆర్ఎస్ నాయకుడి కేసు

చెన్నూర్: పట్టణానికి చెందిన బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ తుంగపిండి రాజేశ్‌పై ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని, రాష్ట్ర ప్రభుత్వంపై రాజేశ్ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఫేస్‌బుక్‌లో పోస్టు చేసినందుకు గాను కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పార్టీలు, ప్రభుత్వంతోపాటు ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా ఫేస్‌బుక్, వాట్సాప్‌లో ఎవరైన పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆత్మరక్షణకు కరాటే ఆయుధం



పోటీలను ప్రారంభిస్తున్న శంకర్



గెలుపొందిన విద్యార్థులు

బెల్లంపల్లి: కరాటే విద్య ఆత్మరక్షణకు ఆయుధంగా నిలుస్తుందని టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్ అన్నారు. పట్టణంలోని టీసీఓఏ క్లబ్‌లో కట్కూరి మల్లేశ్వరి, నీలి పార్వతి స్మారక రెండో జాతీయ స్థాయి కరాటే పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల మానసిక, శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. బాల,బాలికలకు చిన్నతనంలో కరాటే శిక్షణ ఇప్పించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ విజ్జగిరి రవి, దిలీప్‌కుమార్, నిజామ్, కరాటే మాస్టర్లు కట్కూరి వెంకటేశ్, ఎం.శంకర్, శ్రీనివాస్, ఎనగందుల వెంకటేశ్, ఈశ్వర్‌కుమార్, దేవయ్య, శ్రీనివాస్, రవి, రాజేష్, రాజా, భూషణ్, శివ మహేశ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు చిన్న రాజం, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

చెన్నూర్: బెల్లంపల్లిలో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో స్థానిక శర్వాణి పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు కరాటే ఇన్‌స్ట్రక్టర్ రామగిరి స్వామి తెలిపారు. ఆరేళ్లలోపు కటా విభాగంలో స్నేహిత్ కుమార్ (బంగారు), ఎనిమిదేళ్లలోపు కటా విభాగంలో ఆర్.సృజన్ (బంగారు) పతకాలు సాధించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలను కరస్పాండెంట్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి, మాస్టర్లు అభినందించారు.

బాల్య వివాహం అడ్డగింత



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చింతలమానెపల్లి: మండలంలోని హేటిగూడ గ్రామంలో బాల్యవివాహాన్ని బాలల సంరక్షణ అధికారులు ఆదివారం అడ్డుకున్నారు. సోమవారం బాలికకు వివాహం నిశ్చయించారని సమాచారం అందడంతో వారు గ్రామానికి చేరుకున్నారు. బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు అధికారులు అవగాహన కల్పించారు. లీగల్ సెల్ అధికారి ఎం.శ్రీనివాస్ మా ట్లాడుతూ బాల్యవివాహాలు జరిపిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్యవివాహాలతో బాలికకు ఆరోగ్య, మానసిక పరమైన సమస్యలు వస్తాయన్నారు. బాలికను జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రానికి తరలించారు. 1098 కోఆర్డినేటర్ ప్రవీణ్, కౌన్సిలర్ రవళి, స్థానిక సిబ్బంది ఉన్నారు.

శనగ కుప్ప దగ్ధం



మంటలార్పుతున్న గ్రామస్తులు

జైనూర్: మండలంలోని ఊశేగాం గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు శనగ పంట కుప్ప దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామపటేల్ పెందూర్ అమృత్‌రావు యాసంగిలో ఐదెకరాల్లో శనగ సాగు చేశాడు. ఆదివాసీలు అట్టహాసంగా నిర్వహించే పెద్దదేవుని పూజల నిమిత్తం గ్రామస్తులంతా పటేల్ ఇంటి వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. పానపటార్ నుంచి ఊశేగాం వైపు బైక్‌పై వెళ్తున్న వారు పంట కుప్పలకు మంటలు అంటుకున్న విషయాన్ని గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మంటలార్పగా అప్పటికే దగ్ధమైంది. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి



ఆలయంలో పూజలు చేస్తున్న న్యాయమూర్తి

భైంసా: బాసర సరస్వతీ మాతను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రావణ్‌కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా బాసర చేరుకుని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు శాలువాతో సత్కరించి అమ్మవారి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందించారు. ఇందులో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఆలయ చైర్మన్ శరత్ పాఠక్, ఈవో విజయరామారావు, ఏఈవో సుదర్శన్‌గౌడ్, ప్రధానార్చకులు, వేదపండితులు ఉన్నారు.

'విజయ సంకల్పయాత్ర విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బస్సు యాత్ర ఇన్‌చార్జి రావులరాంనాథ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఈ యాత్ర కొనసాగుతున్నట్లు తెలిపారు. బాసర నుంచి ప్రారంభమయ్యే యాత్ర ముధోల్, నిర్మల్, బోథ్, ఆదిలాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల మీదుగా బస్సు కొనసాగనుందని తెలిపారు. ఈ నెల 22న ఇంద్రవెల్లి మండల కేంద్రంలో యాత్ర ఉంటుందని వివరించారు. త్వరలో నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో 12 పార్లమెంట్ స్థానల్లో గెలిపే లక్ష్యంగా ఈ యాత్ర కొనసాగుతుందని, యాత్రకు రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ బస్సు యాత్రకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దిపక్‌సింగ్‌షెకవ్, జిల్లా నాయకులు ఆడావ్ చంపత్‌రావ్, మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, కార్యకర్తలు భీంరావ్, పెందోర్ భీంరావ్ ఉన్నారు.

యూఎస్‌పీసీ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మంచిర్యాలఅర్బన్: నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విరమించుకోవాలని, కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా స్థానిక ఐబీ చౌరస్తా వద్ద ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు మద్దతు ధరని చట్టబద్ధత చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజావేణు, రమేశ్, మోతే జయకృష్ణ, ఆగాచారి, జాకీర్, కిరణ్, అప్పారావు, శంకర్, సురేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



జింకను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

లక్ష్మణచాంద: కుక్కల దాడిలో జింక మృతి చెందిన సంఘటన మండలంలోని మునిపెల్లి గోధావరి సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని మునిపెల్లి గ్రామ గోదావరి సమీపంలో ఆదివారం గోదావరి గట్టున గల పంటపొలాలో కుక్కలు జింకపై దాడి చేస్తుండగా రైతులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ డిప్యూటీ ఎఫ్ఆర్‌వో నజీర్‌ఖాన్ సిబ్బందితో వెళ్లి చూడగా జింక అప్పటికే మరణించింది. దీంతో వెంటనే మండల పశు వైద్యాధికారి అజయ్ కుమార్‌కు ఫోన్‌లో సమాచారం అందజేయగా ఆయన అక్కడకు చేరుకుని పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అక్కడే ఖననం చేశారు. ఇందులో ఎఫ్‌బీవో నూమన్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట సమీపంలోని అర్బన్ పార్కు వద్ద ఆదివారం జరి గిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ సీఐ రవీందర్ కథనం ప్రకారం.. వేమనపల్లి మండలం రాజారం గ్రామానికి చెందిన యువకులు నాయిని గోవర్ధన్, సుమన్‌లు బైక్‌పై పని నిమిత్తం మంచిర్యాలకు వెళ్లి తిరిగివస్తున్నారు. ఈక్రమంలో చెన్నూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న లారీ అతివేగంతో బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు పంపించారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కారు బైక్‌ను ఢీకొని ఒకరు..

భీమారం: కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. నెన్నెల మండలం వెంకటాపూర్‌కు చెందిన జక్కుల కిష్టస్వామి తన స్నేహితుడితో కలిసి బైక్‌పై చెన్నూర్‌లోని గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా ఆదివారం భీమారం బస్టాండ్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొంది. కిష్టస్వామికి గాయాలు కాగా, అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.